విష్ణు మొహంలో క్షణకాలం కోపం తొంగిచూసింది.

"ఓ..కె....ఓ.కె. సార్" అన్నాడు హేళనగా.

"గుడ్‌మాణింగ్ సర్!"

సురేష్ తలతిప్పి పక్కకు చూశాడు. పక్కనే బాంబ్ పేలినట్లు అదిరిపడ్డాడు. ఆమె ప్రత్యూష! ప్రత్యూష! తన ఫ్రెండ్ ప్రత్యూష.

"అయామ్ రెడీ" అన్న ప్రత్యూష.

"అయామ్ యువర్ న్యూ సెక్రటరీ సర్"

"హలో! ప్రత్యూషా...." అనేసి నాలిక్కరుచుకున్నాడతను.

ఆమె ఆశ్చర్యపోయింది. విష్ణు పొడి దగ్గు దగ్గాడు.

సురేష్‌కి గుర్తుకొచ్చింది. తనకూ అర్జున్‌కీ వున్న కొద్దిపాటి తేడాలు తెలుసుకోకుండా వుండటానికి కొత్త సెక్రటరీని ఏర్పాటు చేశారని చెప్పారు.

"నాకూ తెలిసింది మిమ్మల్ని ఎపాయింట్ చేశారని, చాలా జాగ్రత్తగా వర్క్ చేయాలి మీరు. ఏ మాత్రం లాస్ కనిపించినా అయ్ విల్ శాక్ యూ" కఠినంగా అన్నాడతను.

అమె కళ్ళలో బెదురు కనిపించింది. విష్ణు నమ్మలేనట్లు చూస్తున్నాడు.

"ఐ విల్ డూ మై బెస్ట్ సర్!"

"ఎస్! ఐ డిజర్వీట్! వాటార్ ది ఎపాయింట్‌మెంట్స్?"

"ప్రెస్ పార్టీ వెయిట్ చేస్తున్నారండీ"

"ఓ.కె. పంపించండి"

ఆమె బయటికెళ్ళిపోయింది.

విష్ణు అతని భుజం తట్టాడు "మేము వూహించినదానికన్నా చాలస్మార్ట్ నువ్వు."

"ఆఫీస్‌లో పర్సనల్ టాక్ వద్దు" సీరియస్‌గా అన్నాడు సురేష్ .

విష్ణుకి మళ్ళీ కోపం ముంచుకొచ్చింది.

"షటప్! నేనేం చేయాలో, ఎప్పుడేం మాట్లాడాలో నాకు తెలుసు. అతితెలివి ప్రదర్శించకు" అన్నాడతను.

మరుక్షణంలో తలుపు తెరుచుకుని బిలబిలమంటూ కొంతమంది రిపోర్టర్లు, ఫోటోగ్రాఫర్లు లోపలకు జొరబడ్డాడు. వెనుక వైపు గదిలోనుంచి తలుపు తెరచుకుని సహదేవ్ వచ్చి సురేష్‌కి దూరంగా వున్న కుర్చీలో కూర్చున్నాడు. రిపోర్టర్స్‌లో నుంచి ఓ పొడుగాటి వ్యక్తి లేచి నిలబడ్డాడు.

"ఇన్ని రోజుల తర్వాతయినా ఎపాయింట్‌మెంట్ ఇచ్చినందుకు చాల థాంక్స్ సర్! మాక్కావలసిన ఇన్‌ఫర్మేషన్ యిస్తే వుయ్ విల్ బి గ్రేట్‌ఫుల్ టు యూ."

"ప్లీజ్ ప్రొసీడ్! డోంట్ వేస్ట్ టైం....." అసహనంగా అన్నాడు సురేష్ అతివేగంగా... . మాట్లాడుతూ. అతని వేగానికి షార్ప్‌నెస్‌కీ విష్ణు నివ్వెరపోయాడు. సహదేవ్ నోరు తెరిచాడు.

"ఏప్రిల్ 82లో మీ కంపెనీ షేర్స్ మీద వత్తిడి రావటం వలన మీ మేనేజ్ మెంట్ సుమారు ఎనిమిది లక్షల షేర్లు నాన్ రెసిడెంట్ ఇండియన్స్ కోసం కొంది. మళ్ళీ 92లో మళ్ళీ వత్తిడి వచ్చిందనే సాకుతో మళ్ళీ మీ మేనేజ్‌మెంట్ మరో పది లక్షల షేర్లు కొనుక్కుంది! ఇదీ నాన్ రెసిడెంట్ ఇండియన్స్ కోసమే. అంటే సుమారు 22 కోట్ల రూపాయలు విదేశీ భారతీయులు కొనుక్కున్నారు. కానీ అప్పటి రూల్స్ ప్రకారం విదేశీ భారతీయుడు మనదేశంలో లక్ష రూపాయలకు మించి షేర్లు కొనే అధికారం లేదు. అంటే మీ 22 కోట్ల రూపాయలకు 188మంది విదేశీ భారతీయులు కావాలి కానీ లేరు.

కేవలం పదకొండుమంది మాత్రమే వున్నారు. అప్పుడు మీరు ఈ సమస్య నుంచి తప్పించుకోటానికి మీ పరపతినుపయోగించి కేంద్ర ఆర్థిక మంత్రితో కొత్త రూల్ పాస్ చేయించారు. దాని ప్రకారం ఒక్క ఎన్.ఆర్.ఐ ఒక లక్ష ఫేస్ వాల్యూ వరకే కొనగలడన్న నిబంధన తొలగిపోయింది. అదీ 72 గంటల్లో! కనుక ఈ విషయంలో పెద్ద ఫ్రాడ్ జరిగిందని నా అభిప్రాయం. మీ సమాధానమేమిటి?"

సురేష్‌కేం చెప్పాలో తెలీలేదు.

సహదేవ్ చటుక్కున అందుకున్నాడు.

"ఆర్దికమంత్రి 72 గంటల్లో ఆ నిబంధన తొలిగించటం కేవలం కాకతాళీయం..అంతే....! మా కంపెనీ కోసం రూల్స్ మారిపోవు."

"మీకు, ఆర్థికమంత్రికీ చాలా స్నేహం వుందని తెలిసింది. ఆ స్నేహాన్ని ఈ ఫ్రాడ్ కోసం వాడుకున్నారని నా ఆరోపణ!" మరో రిపోర్టర్ అడిగాడు.

సురేష్ కోపంగా చూశాడతనివంక.

"ప్లీజ్ స్టాప్ దట్ ఫ్రాడ్ నాన్సెన్స్! మా కంపెనీకి ఫ్రాడ్ చేయాల్సిన అవసరంలేదు. మాకు హ్యూజ్ ప్రాఫిట్స్ వస్తున్నాయి ప్రతి సంవత్సరమూ" చాల స్పీడుగా మాట్లాడాడు సురేష్.

సహదేవ్ మళ్ళీ ఆశ్చర్యపోయాడు.

"మీకన్ని లాభాలు వస్తుంటే మరి ఒక జాతీయం చేయబడిన బ్యాంక్ నుంచి మీ కంపెనీ అయిదు కోట్ల రూపాయలు అప్పు తీసుకుంది.... ఎందుకని?"

"రొటేషన్ కోసం! అది తీసుకోకపోయినా మాకేమీ సమస్య లేదు."

"అదికాక ఇంకా అనేక చిన్న కంపెనీల పేర్లతో మీరే మరో వంద కోట్ల రూపాయల లోన్ కోసం ఎందుకు ప్రయత్నాలు చేశారు? కొన్ని బ్యాంక్‌లు మీ కంపెనీలు కొన్నిటికి వెంబడే 25 లక్షల ఓవర్ డ్రాఫ్టు యిచ్చాయి?"

"అది మీరు బ్యాంక్‌లనడగాల్సిన విషయం! మాకు రొటేషన్ కోసం ఎంత డబ్బయినా అప్పుగా తీసుకునే హక్కు వుంది!" సహదేవ్ చెప్పకముందే తనే మాట్లాడాడు సురేష్.

సహదేవ్ నమ్మలేకపోతున్నాడు. సురేష్ ఇంత తెలివికలవాడని అతనూహించలేదు. అన్నీ తెలిసినవాడిలాగా అతి లాఘవంగా, తెలివిగా మాట్లాడుతున్నాడు.

మరో రిపోర్టర్ లేచి నిలబడ్డాడు.

"ఆగష్టు-అక్టోబర్ 84లో మాధురీ ఇండస్ట్రీస్‌కి ప్రభుత్వం ఇండస్ట్రియల్ లైసెన్స్‌లు యిచ్చింది. దీని ప్రకారం పాలియస్టర్ బట్టలు... ఫిలమెంట్ యార్న్ ఇండస్ట్రీస్ కోసం కావలసిన ముడి పదార్థాలు అంటే ట్రెప్తాలిక్ యాసిడ్ మెనో ఇథిల్ గ్లయికాల్ తయారు చేసే ఫ్యాక్టరీలు చాలా ఎక్కువ పెట్టుబడితో ప్రారంభించవచ్చు. కానీ ఈ పర్మిట్‌లో ఓ నిబంధన వుంది. అదేమిటంటే మాధురీ ఇండస్ట్రీస్ బ్యాంక్‌ల నుంచిగానీ ఇతర ఆర్థిక సంస్థల నుంచిగానీ డబ్బు అప్పుగా తీసుకోకూడదు. కానీ మాధురీ ఇండస్ట్రీస్ ఒక ట్రిక్ ప్లే చేసి వందకోట్లు బ్యాంక్‌ల ద్వారా ఓవర్ డ్రాఫ్టు రూపంలో సంపాదించి పెట్టుబడికి ఉపయోగించింది.

దీనినిబట్టి ప్రభుత్వమే తను విధించిన నిబంధనలను పట్టించుకోకుండా దాటవేస్తోందని తెలుస్తోంది. ఇది కూడా కాకతాళీయమేనా? ఇందులో కూడా ఫ్రాడ్ ఏమీలేదా?"

సహదేవ్ నుదుటి మీద చెమటలు తుడుచుకుంటున్నాడు. విష్ణు నోటమాటలేదు. సురేష్ సహదేవ్ వైపు చూశాడు.

సహదేవ్ ఈ ప్రశ్నకు సమధానం చెప్పలేడని తెలుస్తోంది. తనే ఏదోకటి మాట్లాడాలి.

తనకి ఈ గొడవలన్నీ కొత్తవయినా, ఇలాంటి వ్యవహారాలు న్యూస్‌పేపర్లలో కొల్లలుగా చదువుతూనే వుంటాడు. కనుక అవినీతి కొత్తదేమీ కాదు. ప్రభుత్వంలో, మినిష్టర్స్‌లో, పరిశ్రమల్లో పాతుకుపోయి వుంది. అందరికీ తెలుసీ విషయం-న్యూస్‌పేపర్‌వల్ల.

"మీకు దొరికిందంతా రాంగ్ ఇన్‌ఫర్మేషన్ మిష్టర్! మాధురి ఇండస్ట్రీస్ ఇతర సంస్థల పేర్లతో తీసుకున్న వంద కోట్ల డ్రాఫ్టు మేము క్రొత్త ప్రాజెక్ట్‌కి పెట్టుబడిగా వుపయోగించటం లేదు. నెక్టస్ క్వొశ్చెన్ ప్లీజ్?" మళ్ళీ అదే వేగంతో సమాధాన మిచ్చాడతను.

"కానీ....మా దగ్గరున్న ఇన్ఫర్మేషన్ ప్రకారం..." అంటూ మళ్ళీ ఏదో అడగబోయాడు రిపోర్టర్.

"సారీ టైమ్ ఈజ్ అప్" అన్నాడు టైమ్ చూసుకుంటూ.

ఫోటోగ్రాఫర్లు లేచి నిలబడ్డారు.

సురేష్ కొద్ది క్షణాలపాటు ఫ్లాష్‌లైట్ల కాంతిలో వెలిగిపోయాడు.

అందరూ బయటికెళ్ళిపోయారు.

సహదేవ్ లేచి నిలబడ్డాడు.

"ఒండర్‌ఫుల్ పెర్‌ఫార్మెన్స్ సురేష్ ! లక్కీ... మాకు నువ్వు దొరకటం"

"ప్లీజ్! ఫర్ గెట్ దట్ సురేష్ స్టఫ్....యిక్కడున్నంతసేపూ. ఫర్ యువర్ సేక్"

"ఓ! అయామ్ సారీ!"

"దట్స్ ఓ.కె." టేబుల్ మీదున్న ఇంటర్‌కమ్ బటన్ ప్రెస్ చేశాడు సురేష్ .

"ఎస్సర్!" వినయంగా మాట్లాడింది ప్రత్యూష.

"అయామ్ టైర్డ్ ప్రత్యూషా ప్లీజ్ బ్రింగ్ సమ్ టీ."

సహదేవ్ బయటికెళ్ళిపోయాడు. విష్ణు కోపంగా చూశాడు సురేష్ వైపు.

"అది ఆమె జాబ్ కాదు. నేను ఏర్పాటు చేస్తాను."

"ఈ చిన్న విషయంలో నీ జోక్యం అనవసరం" సీరియస్‌గా జవాబిచ్చాడు సురేష్.

ఒక్కసారిగా రాక్షసుడు బయటకు వచ్చాడు. ఒక్క అంగలో ముందుకు దూకి సురేష్‌ని పట్టుకుని కుర్చీలోంచి లేవనెత్తాడు. అలా చేస్తాడని వూహించిన సురేష్ పైకి లేస్తూనే మోచేత్తో అతని ముఖం మీద బలంగా కొట్టాడు.

చటుక్కున అతన్ని వదిలేసి "అబ్బా" అంటూ ముఖం రెండు చేతులతో మూసుకున్నాడు విష్ణు.

ఆ తర్వాత విష్ణు తనను ఎంత దారుణంగా హింసించగలడో తెలుసు. తను నిస్సహాయంగా అతని చేతిలో చావు దెబ్బలు తినటం తప్ప మరేమీ చేయలేడని కూడా తెలుసు. అయినా తనకున్న కొద్దిపాటి పరిధిలోనే కొంచెం స్వాతంత్ర్యం కోసం జరిపిన పోరాటం అది. రిస్క్ అయినా పర్లేదు.

విష్ణు ముఖం మీదనుంచీ చేతులు తీశాడు. నోటి దగ్గర వాచిపోయిందతనికి. కళ్ళు చింతనిప్పుల్లా వున్నాయి.

"బాస్టర్డ్.... ఇప్పుడు చూద్దువుగాని నేనేమిటో...." అతని మీదకు భయంకరంగా వస్తూ అన్నాడు.

అప్పుడే వెనకవేపు తలుపు తెరుచుకుని లోపలికి అడుగుపెట్టింది మాధురి.

విష్ణు ఎలక్ట్రికల్ స్విచ్ నొక్కినట్లు నిలబడిపోయాడు. అతని ముఖంలో ఎక్స్‌ప్రెషన్ మారిపోయింది.

"గుడ్ మార్నింగ్ మేడమ్" అన్నాడు వినయంగా.

ఆమె అతనిని పట్టించుకోకుండా సురేష్‌ని చూసి చిరునవ్వు నవ్వింది.

"ప్రెస్ కాన్ఫరెన్స్ గురించి విన్నాను. అయామ్ వెరీ హేపీ."

సోఫాలో కూర్చుంటూ అంది. ఆమె గొంతు నెమ్మదిగా, మెత్తగా, మత్తుగా వినబడుతోంది.

"థాంక్యూ!" అన్నాడు సురేష్.

ప్రత్యూష ట్రేతో 'టీ' తెచ్చి టేబుల్ మీదుంచి బయటకెళ్ళిపోయింది.

సురేష్ 'టీ' రెండు కప్పుల్లో పోసి ఒకటి మాధురికి అందించాడు.

"తీసుకోండి."

"నో థాంక్స్!"

"నో థాంక్స్!" అంది ఆమె చేతి మీద చిలుక కూడా. ఆమె కప్పు టీపాయ్ మీద వుంచి-తను 'టీ' తాగసాగాడు.

"వినయ్ కూడా ఈ మాత్రం కోపరేట్ చేసి వుంటే-పాపం అతనికి యాక్సిడెంట్ జరిగేది కాదు" అందామె.